మాస్టర్‌మైండ్స్ విజయోత్సవ ర్యాలీ

గుంటూరు ఎడ్యుకేషన్: మాస్టర్‌మైండ్స్ విజయోత్సవ ర్యాలీ సోమవారం నిర్వహించారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్స్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ఈనెల 11న ప్రకటించిన సీఎంఏ ఫైనల్, ఇంటర్ పరీక్షా ఫలితాల్లో విద్యార్థులు అఖిల భారత స్థాయిలో టాప్ ర్యాంకులను కైవసం చేసుకున్న సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా బ్రాడీపేటలోని మాస్టర్‌మైండ్స్ ప్రధాన కార్యాలయం వద్ద అధ్యాపకేతర సిబ్బందితో కూడిన బైక్ ర్యాలీని సంస్థ క్యాంపస్ ఇన్‌చార్జిలు వై.శ్రీనివాసరావు(వైఎస్సార్), ఆంజనేయ విజయ్‌కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా వైఎస్సార్ మాట్లాడుతూ సీఎంఏ ఫలితాల్లో అఖిల భారతస్థాయిలో 2వ, 5వ ర్యాంకులు సహా, సీఎంఏ ఇంటర్ ఫలితాల్లో అఖిల భారతస్థాయిలో 4వ ర్యాంకు, 10వ ర్యాంకు సాధించి చరిత్ర సృష్టించినట్లు వివరించారు. 10 ర్యాంకుల లోపు ఐదు, 50 ర్యాంకుల లోపు 30 ర్యాంకులను విద్యార్థులు కైవసం చేసుకున్నారని తెలిపారు. అనంతరం బ్రాడీపేటలోని మెయిన్ క్యాంపస్ నుంచి ర్యాలీగా బయల్దేరిన అధ్యాపకేతర సిబ్బంది శంకర్‌విలాస్, లాడ్జి సెంటర్ మీదుగా తిరిగి క్యాంపస్‌కు చేరుకున్నారు.



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఆంజనేయ విజయ్‌కుమార్

పర్యావరణ పరిరక్షణపై అవగాహన

గుంటూరు ఎడ్యుకేషన్: పర్యావరణ పరిరక్షణపై సమాజాన్ని చైతన్యపర్చాలని ఏఎన్‌యూ వీసీ డాక్టర్ కె.గంగాధరరావు పేర్కొన్నారు. మార్కెట్ సెంటర్‌లోని హిందూ కళాశాలలో వృక్షశాస్త్ర విభాగం, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్తంగా సోమవారం డాక్టర్ టీఎస్ రామారావు మెమోరియల్ జాతీయస్థాయి సదస్సు నిర్వహించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విశ్రాంత అధ్యాపకుడు ప్రొఫెసర్ ఎంఎస్‌వీ ప్రసాద్, కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణమూర్తి, ప్రభుత్వ జ్వరాల ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.రఘు మాట్లాడారు.

సంక్షిప్త వార్తలు

● కూటమి ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

లక్ష్మీపురం: అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దీప్తి మనోజ్ డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం గుంటూరు ప్రాజెక్టు కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుజరాత్ హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం అంగన్‌వాడీలను క్రమబద్ధీకరించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్‌వాడీలకు గ్రాడ్యుటీ అమలు చేయాలని, కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. గుంటూరు నగరంలో హెల్పర్ పోస్టులు ఖాళీలను వెంటనే పూర్తి చేయాలని కోరారు. ధర్నా అనంతరం సీడీపీఓ కృష్ణవేణికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పద్మ, బాజీ బి.కష్ణకుమారి, ప్రసన్న, సంకీర్తి, జానీ పాల్గొన్నారు.

● ఏప్రిల్ 6న శ్రీరామనవమి శోభాయాత్ర

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో శ్రీరామ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏప్రిల్ 6న నిర్వహించనున్న శ్రీరామనవమి రథయాత్ర(శోభాయాత్ర) గోడప్రతులను సోమవారం ఆవిష్కరించారు.

● రేపు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో బుధవారం రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ ఉచిత వైద్య పరీక్ష శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

● చిత్రలేఖన విజేతలకు బహుమతులు ప్రదానం

నగరంపాలెం: స్థానిక మార్కెట్ కూడలిలోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో క్రియేటివ్ ఫైన్ ఆర్ట్స్ అకాడమి, రాష్ట్ర క్రియేటివిటి కల్చర్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం జాతీయ స్థాయిలో 19వ చిత్రలేఖన పోటీలు, ఆర్ట్ ఎగ్జిబిషన్, అవార్డ్స్ ప్రదానోత్సవ సభ నిర్వహించారు. బార్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సంయుక్త ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కల్చరల్ కమిషన్ చైర్‌పర్సన్ పొడపాటి తేజస్వి, సీతాఓ రేగుళ్ల మల్లికార్జునరావు, అకాడమి చైర్మన్ డాక్టర్ కేపీ బాబు, డైరెక్టర్ సునీత పాల్గొన్నారు.

● నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొరిటెపాడు: రవీంద్రనగర్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో లైనుల మరమ్మతుల నిమిత్తం మంగళవారం సరఫరా నిలిపి వేయనున్నట్లు అధికారులు సోమవారం తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అంతరాయం ఉంటుందని చెప్పారు. రవీంద్రనగర్, స్థంభాలగరువు, పట్టాభిపురం, శ్రీనగర్, శ్యామలానగర్ ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

11 కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైనుల మరమ్మతుల నిమిత్తం సరఫరా నిలిపివేయనున్నట్లు డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సోమవారం తెలిపారు. మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు భారపేట జీరోలైను, పొట్టిశ్రీరాములు నగర్ జీరోలైను నుండి 7వ లైను వరకు, శ్రీనగర్ 1, 2, 3, 4 లైను ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందన్నారు.

● వైభవంగా ధ్యాన మందిరం వార్షికోత్సవం

నగరంపాలెం: స్థానిక కొత్తపేట శ్రీగణేశ్వరరావువీధిలో కొలువైన శ్రీషిరిడి సాయిబాబా ధ్యాన మందిరం 12వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం వైభవంగా నిర్వహించారు.

● ప్రవచనాలు ప్రారంభం

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై చిన్మయ మిషన్ సువీరానందస్వామి శ్రీమద్భగవద్గీత భక్తియోగం ప్రవచనాలు సోమవారం మొదలయ్యాయి.

● ఎమ్మెల్సీ లక్ష్మణరావుకు మద్దతుగా ప్రచారం

లక్ష్మీపురం: ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావుకు మద్దతుగా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నగరంలో పాత గుంటూరు, గుజ్జనగుండ్ల, నల్లచెరువు, గోరంట్ల, సాయిబాబా రోడ్డు తదితర ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు.

కేంద్ర బడ్జెట్‌పై వామపక్షాల ఆగ్రహం



లక్ష్మీపురం: కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ మూడో సారి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రవేశ పెట్టిన మొదటి బడ్జెట్‌లో సామాన్యులకు చోటు లేకపోవడంపై వామపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. పేద ప్రజల ప్రయోజనాలకు తూట్లు పొడిచి బడా పారిశ్రామిక వేత్తల అనుకూల బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.సూర్యారావు అన్నారు. శకంర్ విలాస్ సెంటర్‌లో వామపక్షాల ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకుడు రావుల అంజీబాబు, సీపీఎం నగర కార్యదర్శి కె.నళినికాంత్, సీపీఎం ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎస్.విష్ణు, వామపక్ష నాయకులు పాల్గొన్నారు.

రైతు చల్లగా.. పంట తా'జాగా'



- కల్పతరువులు.. కోల్డ్ స్టోరేజ్‌లు
- జిల్లా వ్యాప్తంగా 120కిపైగా శీతల గిడ్డంగులు
- అన్ని వసతులతో అందుబాటులో..

కొరిటెపాడు(గుంటూరు): గతంలో పండించిన పంటలను నిల్వ చేసుకోవాలంటే రైతులు అనేక కష్టాలను చవిచూసేవారు. అప్పట్లో చేసేది ఏమి లేక ఇళ్లల్లోనూ, పొలాల్లోనూ వాటిని జాగ్రత్తగా భద్రపరచుకునేవారు. అంతేగాక దాచిన పంట కీటకాలు, ఇతరత్రా మూషికాల బారినుంచి కాపాడుకునేందుకు అనేక అవస్థలను ఎదుర్కొనేవారు. క్రమేణా రైతులు ఆ బాధలు నుంచి బయటపడ్డారు. పండించిన తొలినాళ్ళల్లో పంట ఏ విధంగా ఉందో.. నెలలు గడిచిన, అమ్మే వరకు సరకు అలాగే తాజాగా ఉంటుంది. అందుకు కారణాలు లేకపోలేదు. రైతులు పండించిన పంటను సుదీర్ఘ కాలం పాటు నాణ్యంగా ఉండేందుకు శీతల గిడ్డంగులు(కోల్డ్ స్టోరేజ్‌లు) సిద్ధంగా ఉన్నాయి. శీతల గిడ్డంగులు పదుల సంఖ్యలో కాదు.. వందల్లో ఏర్పడ్డాయి. దీంతో రైతుల మొముల్లో ఆనందం వెల్లి విరుస్తున్నాయి. గుంటూరు జిల్లాలో సుమారు 120కి పైగా శీతల గిడ్డంగులు ఉన్నాయి. గుంటూరు నగరానికి అనుసంధానంగా సుమారు 90 శీతల గిడ్డంగులు రైతులకు అందుబాటులో ఉన్నాయి. ఇక్కడికి గుంటూరు జిల్లాతోపాటు కర్నూలు, ప్రకాశం, కృష్ణా జిల్లాలు, కర్నాటక, తెలంగాణ రాష్ట్రాలల్లోని రైతులు ధరలు సరిపడా లేనప్పుడు, అక్కడ సరిపడా శీతల గోదాములు లేకపోవడం వల్ల గుంటూరుకు తీసుకువచ్చి నిల్వ చేసుకుంటున్నారు. కోల్డ్ స్టోరేజీల్లో విశాలమైన గదులు, లిఫ్ట్ సౌకర్యం, రైతుల బస చేసేందుకు వీలుగా విశ్రాంతి గదులు, తక్కువ ధరలకే బస్తాలను అద్దెకు భద్రపరుచుకునేలా ఏర్పాట్లు చేశారు. దీంతో గుంటూరు నగర శివారు ప్రాంతాలతో పాటు కర్నూలు, అనంతపురం, కృష్ణా, ప్రకాశం, నెల్లూరు జిల్లాలు, తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం జిల్లా, కర్ణాటక రాష్ట్రంలోని బళ్ళారి నుంచి రైతులు తమ మిర్చి సరుకును విక్రయించుకునేందుకు ఇక్కడ శీతల గిడ్డంగులను ఆశ్రయిస్తుంటారు. వారి రాకతో గిడ్డంగులు నిండు కుండలా మారుతున్నాయి. చాలా గిడ్డంగుల్లో యాజమానులు రైతులకు మరిన్ని సౌకర్యాలను కల్పించడంలో ముందంజలో ఉంటున్నారు. కొందరైతే ఏకంగా రైతులకు రుణాలు సైతం యిప్పిస్తున్నారు. దీంతో రైతుల పాలిట కల్పతరువుగా మారాయి. అదే విధంగా వ్యవసాయ మార్కెట్ యార్డుకి తీసుకొచ్చిన సరుకు ఏదైనా అమ్మకం జరగకపోయిన వెంటనే గిడ్డంగుల్లో అరబెట్టేందుకు అవకాశాలు కల్పిస్తున్నారు. దీనికితోడు శీతలీకరణ (ఏసీ) నిర్వహణు బేషుగ్గా నిర్వహిస్తున్నారు. 6 నుంచి 8 డిగ్రీల వరకు శీతలీకరణలో నిర్వహణ చేస్తున్నారు. ఉదాహరణకు ఏదైనా రకం మిర్చి రూ.10 వేలు పలికితే, ఆ ధర రైతుకు గిట్టుబాటు కాదని భావించి గిడ్డంగుల్లో నిల్వ చేసుకుంటే అదే మిర్చి రూ.15 వేలకు మించి ధర పలికినప్పుడు విక్రయించుకునేందుకు అవకాశం ఉంటుంది. తద్వారా వాటి వల్ల రైతులు లాభాపడినట్లే. రైతుల పురుగు మందుల వాడకం ఆధారంగా కూడా సరుకు నిల్వపై ప్రభావం చూపుతుందని గిడ్డంగుల యాజమానులు అంటున్నారు. వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనల మేరకు రైతులు మంచి విత్తనాలు తీసుకుని వారి ఆచరణకు అనుగుణంగా మందుల వాడకం వల్ల అధిక దిగుబడికి అవకాశం ఉంది. దానికితోడు సరుకులో నాణ్యత పెరుగుతుంది. దీనివల్ల రైతులు అందరూ లాభాదాయంగా ఉంటారు. అయితే గత ఏడాది మార్చి నెలలో సుమారుగా క్వింటా ధర రూ.20 వేల నుంచి రూ.25 వేలు ఉండగా నేడు క్వింటా రూ.10 వేల నుంచి రూ.13 వేల లోపు మాత్రమే పలుకుతోంది. దీంతో రైతులు తాము తీసుకొచ్చిన మిర్చిని కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకోవడం జరుగుతోంది. అయితే రైతులకు మాత్రం గిడ్డంగులు కల్పతరువుగా మారాయి అనడంలో ఎలాంటి సందేహం లేదు. ధర తక్కువగా ఉండటంతో యార్డులో విక్రయాలు కొంత మేర నిలిచిపోవడంతో చేతికి వచ్చిన పంటను ఏం చేయాలో అర్థంకాని పరిస్థితి రైతుల్లో నెలకొంది. దీంతో చాలా మంది మిర్చి రైతులు జిల్లాలోని శీతల గిడ్డంగుల వైపు పరుగులు తీస్తున్నారు. కోల్డ్ స్టోరేజీల నిర్వాహకులు సైతం రైతులను దృష్టిలో పెట్టుకుని తక్కువ ధరలకే వాటిని నిల్వ చేసుకుంటున్నారు. రైతులు నిల్వ ఉంచిన సరుకును ఎంచక్కా అధిక ధరలకు విక్రయించుకునేందుకు సన్నాహాలు చేస్తున్నారు. సరకు నిల్వ చేసుకోవడం వల్ల మంచి ధర పలికే అవకాశం ఉంది.

తక్కువ ధరలకే నిల్వ సౌకర్యం...



రైతుల శ్రమను దృష్టిలో ఉంచుకుని అతి తక్కువ ధరలకే పంటను గిడ్డంగుల్లో నిల్వ చేసుకునే అవకాశం కల్పిస్తున్నాం. దీనికితోడు సరుకు పాడవకుండా నాణ్యత ప్రమాణాలను పాటిస్తున్నాం. రైతులు పండించిన పంటను సకాలంలో అమ్ముకోవాలంటే ఒక్కోసారి కుదరదు. ఎందుకంటే పండిన పంటకు కాస్తంత ధర పలికితే విక్రయించాలని రైతులు చూస్తుంటారు. ఒక్కొక్కసారి గిట్టుబాట ధర లభించకపోవచ్చు. గిట్టుబాటు ధర లేనప్పుడు రైతు సరుకును గిడ్డంగుల్లో నిల్వ చేసుకుని ఆశించిన ధర వచ్చినప్పుడు విక్రయించుకోవచ్చు. కొన్ని కోల్డ్‌స్టోరేజ్‌ల యాజమాన్యాలు రైతులకు బ్యాంకు రుణాలు సైతం అందిస్తున్నారు. ప్రభుత్వం విద్యుత్తు సబ్సిడీ కల్పిస్తే రైతులకు తక్కువ ధరకే సరుకును భద్రపరుచుకునేందుకు అవకాశం ఉంటుంది.

-వణుకూరి వెంకటేశ్వరరెడ్డి, శ్రీ లక్ష్మీనరసింహ కోల్డ్‌స్టోరేజీ అధినేత.

గిడ్డంగుల్లో 25 లక్షల మిర్చి బస్తాలు నిల్వ...



కోల్డ్‌స్టోరేజీలకు ఇప్పుడిప్పుడే మిర్చి బస్తాలు వస్తున్నాయి. ఇప్పటి వరకు 10 లక్షల టిక్కీలు పాతవి, మరో 15 లక్షల టిక్కీలు కొత్త సరుకు చేరుకుంది. రైతులకు మంచి సర్వీసు అందిస్తున్నాం. మొత్తంగా 24 లక్షల బస్తాలు రైతులు నిల్వ చేసుకోవడం జరిగింది. బస్తా ఒక్కింటికి రైతు నుంచి రూ.175 మాత్రమే వసూలు చేస్తున్నాం. ముఠా కూలీ, ఇన్సూరెన్స్ కోసం రైతు అదనంగా రూ.50 చెల్లించాల్సి ఉంటుంది. కోవిడ్ కాలంలో కూడా గిడ్డంగులు రైతులకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. రైతుల సరుకు నాణ్యత విషయంలో గిడ్డంగుల యాజమానులు ఏ ఒక్కరూ రాజీపడటం లేదు. అందులో శీతలీకరణ(ఎయిర్‌కండిషన్)లో మరింత నాణ్యత ప్రమాణాలను పాటిస్తున్నాం. రైతులకు మంచి సర్వీసు ఇవ్వాలన్నది ప్రతి యాజమానిలో ఉంది.

-పి.సురేంద్రబాబు, ది కోల్డ్ స్టోరేజీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి